ప్రజాశక్తి
సోమవారం 13 మార్చి 2023
8 పేజీలు




విశాఖపట్నం అనకాపల్లి

బ్యాలెట్.. బుల్లెట్

- భళిరా భళి.. ఉత్తరాంధ్ర శాసన మండలి
- 37 మంది నిలిచిన బరి.. నేడే పట్టభద్రుల ప్రతిధ్వని
- ప్రధాన పక్షాల మధ్య పోటీ
- పిడిఎఫ్‌కు పట్టంకట్టే దిశగా పట్టభద్రులు



స్వర్ణభారతి స్టేడియం నుంచి బ్యాలెట్ బాక్సులను తరలిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర పట్టభద్రులు నేడు తమ ఓటుతో ప్రతిధ్వని వినిపించనున్నారు. పోలింగ్ ఎలాగూ లాంఛనమే. ఈ సారి పిడిఎఫ్‌కు పట్టభద్రులు తమ 'బ్యాలెట్ బుల్లెట్' ద్వారా అభిమానాన్ని చాటుకోనున్నారన్న చర్చ ఉత్తరాంధ్ర జిల్లాల అంతటా ఆదివారం నాటికి ప్రతిధ్వనిగా ఉంది. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు పట్టం కట్టే దిశగా పట్టభద్రులైన ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగులంతా సిద్ధమవుతున్నారు. ఉత్తరాంధ్ర ప్రాంత వాస్తవ సమస్యలు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, ఉద్యోగులపై ప్రభుత్వ వేధింపులపై పోరాడుతున్న ప్రజాసంఘాల తరపున డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అభ్యర్థి కావడమే 'ఏకపక్ష ఓటింగ్'కు ఆస్కారం ఏర్పడుతోందని ప్రస్తుత పరిణామాలతో స్పష్టమవుతోంది. పలు పార్టీలు బరిలో ఉండి ఓట్ల చీలిక జరిగినా పిడిఎఫ్ ఓటింగ్ మాత్రం చెక్కు చెదిరే అవకాశం లేదన్నది తెలుస్తోంది.

బూత్‌లలో 6 గంటల నుంచే పోలింగ్ సిబ్బంది

అన్ని చోట్లా ఉదయం 8 గంటలకే పోలింగ్ ప్రారంభం కానుంది. సాయంత్రం 4 గంటల వరకూ ఎలక్షన్ జరుగనుంది. ఉదయం 6 గంటల నుంచే పోలింగ్ సిబ్బంది ఆయా పోలింగ్ స్టేషన్లలో ఉత్తరాంధ్ర అంతటా సిద్ధంగా

మిగతా 2లో..

విశాఖ, అనకాపల్లిల్లో సర్వం సిద్ధం

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సోమవారం జరిగే పోలింగ్‌కు సర్వం సిద్ధం చేసినట్టు ఆయా జిల్లాల కలెక్టర్లు డాక్టర్ ఎ.మల్లికార్జున, రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. విశాఖలో 112, అనకాపల్లిలో 49 పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయన్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి విశాఖ జిల్లా స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఉన్న పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆదివారం ఉదయం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్‌తో కలిసి పరిశీలించారు. స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం నుంచి జిల్లాలో ఉన్న 112 పోలింగ్ కేంద్రాలకు సరఫరా అవుతున్న పోలింగ్ సామగ్రిని పరిశీలించి ఎన్నికల విధులలో పాల్గొంటున్న అధికారులకు పలు సూచనలు చేశారు. సామగ్రి, సిబ్బంది రవాణా కోసం ఏర్పాటు చేసిన బస్సులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆరు జిల్లాలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరుగుతుందని మల్లికార్జున తెలిపారు. పోలింగ్‌కు పూర్తి భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. విశాఖ జిల్లాలో మొత్తం 15 రూట్లు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. 16న కౌంటింగ్ జరుగుతుందన్నారు.

వైసిపి బరితెగింపు

- ఆగని అక్రమాలు
- ఓటుకు నోటు పంపిణీలో అడ్డంగా దొరికిన కార్యకర్తలు
- భానునగర్, గాజువాకల్లో ఘటనలు
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికను అపహాస్యం చేసిన అధికార పార్టీ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆది నుంచి అధికార వైసిపి బరితెగించి వ్యవహరిస్తోంది. ఎన్నికల నిబంధనలు, ప్రమాణాలు, ప్రజాస్వామిక పద్ధతులేమీ పాటించడంలేదు. చదువులేని వారిని పట్టభద్రుల ఓటర్లుగా నమోదుచేయడంతో ప్రారంభమైన వైసిపి అక్రమాలు, ఎన్నికల ముందురోజు ఓటర్లకు డబ్బుల పంపిణీ వరకు కొనసాగుతూనేవున్నాయి. ఎన్ని అక్రమాలకు పాల్పడినా, అధికార దుర్వినియోగానికి ఒడిగడుతున్నా అధికార యంత్రాంగం చేతులుకట్టుకొని కూర్చొంది. వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ గెలుపుకోసం ఎన్ని అడ్డదారులున్నాయో వాటన్నింటినీ అధికార పార్టీ ప్రయోగించి పట్టభద్రుల ఎన్నికలను అపహాస్యం చేసింది. మూడు సార్లు జరిగిన ఏ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఈ తరహా అప్రజాస్వామిక కార్యక్రమాలు ఇంతలా చోటుచేసుకోలేదు. వార్డు, గ్రామ వాలంటీర్లను ఎన్నికల విధుల్లో భాగస్వాములు చేయొద్దని ఎన్నికల సంఘం స్పష్టంగా ఆదేశించినా వైసిపి లెక్కచేయలేదు. ఓటుకు నోటు పంపిణీలో వాలంటీర్లను ఉపయోగించుకుంది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో అన్ని ప్రాంతాల్లో వైసిపి కొంతమంది ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసింది. ఈ పంపిణీ వాలంటీర్ల సమక్షంలో చేపట్టింది.



డబ్బులు పంచుతూ దొరికిపోయిన వైసిపి కార్యకర్త ఈశ్వరరావు

ఆదివారం విశాఖ నగరంలోని 16వ వార్డు, భానునగర్‌లో వైసిపి కార్యాలయానికి సమీపంలో ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తుండగా వైసిపి కార్యకర్త దొరికిపోయాడు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ

మిగతా 2లో..

జి20 పనుల్లో పైపై మెరుగులు?

వార్త 3లో..

రండి.. గురుకులాల్లో చేరండి

- ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం
- ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ
- విద్యార్థులకు అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నాం
- ప్రజాశక్తి'తో విశాఖ, అనకాపల్లి జిల్లాల గురుకుల విద్యాలయాల సమన్వయకర్త రూపవతి





ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల గురుకుల విద్యాలయాల సమన్వయకర్త ఎస్.రూపవతి తెలిపారు. గురుకులాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నట్టు వెల్లడించారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు విషయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆమె

మిగతా 2లో..

రండి.. గురుకులాల్లో చేరండి

(మొదటి పేజీ తరువాయి..) మాటల్లోనే..

ఏయే గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు ?

బాలికల పాఠశాలలైన మేఘాద్రి గెడ్డలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల పాఠశాల, కొమ్మాది, మధురవాడల్లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, కోనాంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులం, కొక్కిరాపల్లి, తాళ్లపాలెం, నక్కపల్లి, నర్సీపట్నంల్లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాలలతో పాటు, బాలుర పాఠశాలలైన సబ్బవరం, శ్రీ కృష్ణాపురం, దేవరాపల్లి, గొలుగొండల్లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం 2023 -24 విద్యా సంవత్సరానికిగాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాం. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 24లోగా దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా సమర్పించుకోవచ్చు.

ఎవరు అర్హులు ?

5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2010 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించిన వారై ఉండాలి. తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం రూ.లక్షలోపు ఉండాలి. ఐదో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసే విద్యార్థులు, ప్రభుత్వ, ఏదైనా గుర్తింపు పొందిన ప్రైవేటు విద్యాసంస్థలో 2021-22 విద్యా సంవత్సరంలో 3వ తరగతి, 2022- 23 సంవత్సరంలో 4వ తరగతి నిరవధికంగా పాఠశాల చదువు పూర్తి చేసిన వారై ఉండాలి. ఇంటర్ మొదటి సంవత్సరానికిగాను 2022-23 విద్యా సంవత్సరంలో పదో తరగతి (ఆంగ్ల మాధ్యమంలో) పూర్తి చేసి ఉండాలి. జిల్లాలో గల ప్రతి గురుకుల పాఠశాల నుంచి బైపీసీ గ్రూపులో 40, ఎంపీసీ గ్రూపులో 40లో సీట్లు ఖాళీలు ఉన్నాయి. 5వ తరగతిలో ఒక్కొక్క పాఠశాలలో 80 ఖాళీలు ఉన్నాయి. దరఖాస్తు చేసే విద్యార్థులు వెబ్ సెంటర్‌నందుగానీ, వారికి దగ్గరలోని గురుకుల పాఠశాలలోగానీ దరఖాస్తులు సమర్పించవచ్చు. ఏప్రిల్ 23న ప్రవేశ పరీక్ష ఉంటుంది. 5వ తరగతి విద్యార్థులకు ఆ రోజు ఉదయం 10 నుంచి 12 గంటల మధ్య, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పరీక్ష ఉంటుంది.

ఎంపికైన వారికి కల్పించే సౌకర్యాలేంటి ?

అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుకలతో పాటు ఉచిత పుస్తకాలు, 4 జతల యూనిఫారాలు, ఉచిత భోజనం, వసతి, అన్ని రకాల పోటీ పరీక్షలకు శిక్షణ, సిబిఎస్ఇ పాఠ్య ప్రణాళిక ప్రకారం బోధన ఉంటాయి. ట్రంకు పెట్టె, 3 దుప్పట్లు, 4 టవల్స్, భోజనం ప్లేటు, గ్లాసు, కటోర ఇస్తాం. ఏప్రిల్ 23న జరిగే ప్రవేశ పరీక్షకు ఒక గంటకు ముందుగానే పరీక్ష కేంద్రానికి హాజరు కావాలి. హాలు టిక్కెట్లను వారం రోజులు ముందుగా వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి.

హాల్ టిక్కెట్లు ఇవ్వకుంటే క్రిమినల్ కేసులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఫీజులు కట్టలేదన్న నెపంతో ఏ ఒక్క ఇంటర్మీడియట్ విద్యార్థికైనా హాల్ టిక్కెట్ నిరాకరించినట్లు ఫిర్యాదు అందినా, విద్యా సంవత్సరం కోల్పోయినట్లు గుర్తించినా ఆయా కళాశాల గుర్తింపును 2023-24 విద్యా సంవత్సరం నుండి రద్దు చేసేందుకు సిఫార్సులు చేయనున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం మీడియాకు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఇది పరీక్షా కాలమని, విద్యార్థులను మానసికంగా ఫీజులు పేరిట వేధిస్తున్నట్టు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి తమకు ఫిర్యాదులు అందితే, వాటిని పరిశీలనలోకి తీసుకొని ఆయా యాజమాన్యాలపై అవసరమనుకుంటే క్రిమినల్ చర్యలకు కమిషన్ తరపున సిఫార్సులు చేయనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇంటర్మీడియట్ బోర్డు సూచించిన టోల్ ఫ్రీ నెంబర్ 18004257635తో పాటు apscpcr2018@gmail.comకు ఫిర్యాదులు అందితే చర్యలు చేపట్టేందుకు కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు సారథ్యంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సిద్ధంగా ఉందని సీతారాం చెప్పారు.



గురుస్థానం ప్లే స్కూల్ వార్షికోత్సవంలో పాల్గొన్న అతిథులు

ఘనంగా గురుస్థానం స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గురుస్థానం ది ప్లే స్కూల్ వార్షిక వేడుకలు స్థానిక సీతమ్మధారలోని కెఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా జరిగాయి. వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐహెచ్.ఫరూఖీ, విశిష్ట అతిథిగా 43వ వార్డు కార్పొరేటర్ పి.ఉష్షశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫరూఖీ మాట్లాడుతూ గురుస్థానం ది ప్లే స్కూల్ పలు బ్రాంచిలతో ఐదేళ్ళ పూర్తి చేసుకుందని తెలిపారు. చిన్న పిల్లలకు ప్రాథమిక దశలో అక్షరాలు నేర్పే ప్లే స్కూల్స్ నిర్వహణ ఎంతో ప్రశంసనీయమని అన్నారు. ఉష్షశ్రీ మాట్లాడుతూ గురుస్థానం ప్లే స్కూల్ మరింత అభివృద్ధి పథంలో నడవాలని ఆకాంక్షించారు. అనంతరం యుకెజి విద్యార్థులకు కాన్వొకేషన్ జరిగింది. చివరిగా పిల్లలందరూ నృత్య రూపకాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎస్.ఖాన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిషా, గౌరవ అతిథి రాజకుమారి, ప్రిన్సిపాల్ గౌసియా బేగం, తల్లిదండ్రులు, విద్యార్థులు, స్కూలు సిబ్బంది పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..



బ్యాలెట్ బాక్సును పరిశీలిస్తున్న విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున

బ్యాలెట్.. బుల్లెట్

ఉంటారు. విశాఖలోని స్వర్ణభారతి స్టేడియం నుంచి పోలింగ్ సామగ్రి ఇప్పటికే తరలివెళ్లింది. పోలింగ్ బూత్‌లలో ఆయా పార్టీలు, వ్యక్తులకు సంబంధించిన ఏజెంట్ల వివరాలు, ప్రక్రియను ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల మధ్య సిబ్బంది పరిశీలిస్తారు. మద్యం, ధనం, బహుమతులను సాధారణ ఎన్నికలను గుర్తుకు తెచ్చేలాగే ప్రధాన పార్టీలకు చెందిన (ముఖ్యంగా వైసిపి) అభ్యర్థులు రంగంలోకి దించినా పట్టభద్రులెక్కడా చలించకపోవడం స్పష్టంగా ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుస్తోంది. శాసన మండలి ఎన్నికల్లో అధికార వైసిపి, తెలుగుదేశం, బిజెపి అభ్యర్థులు ఉన్నా.. 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్‌కు చెందిన డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అశేషంగా ప్రచారంలో పట్టభద్రుల హృదయాలను గెలుచుకున్నారు. పై నలుగురితో కలిపితే మొత్తంగా 37 మంది ఉత్తరాంధ్ర శాసన మండలి పట్టభద్రుల ఎన్నికల బరిలో నిల్చొనడం ఈ సారి ప్రత్యేకత. మొత్తంగా ఓటర్లు 2 లక్షల 89 వేల 214 మంది ఈ ఎన్నికల్లో ఓటు హక్కును కలిగి ఉన్నారు. వీరిలో ఎంత మంది ఓటింగ్‌కు వస్తారన్నది చూడాల్సిందే.

పోలింగ్ ఘట్టం నేడే

ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలకు సంబంధించి అన్ని దశలూ పూర్తయ్యాయి. సోమవారం పోలింగ్ దశ. 11వ తేదీ వరకూ జరిగిన ప్రచార పర్వంలో అధికార వైసిపి డబ్బు, బహుమతుల పంపకాలతో పట్టభద్రులను ప్రలోభాలకు గురి చేసే ప్రయత్నాలను ప్రజాసంఘాల కార్యకర్తలు కొన్నిచోట్ల ఇప్పటికే తిప్పికొట్టారు. అయినా అక్రమ పద్ధతులను ఆ పార్టీ విడనాడలేదు. ఆదివారం రాత్రంతా డబ్బు పంపకాలు అన్నిచోట్లా కొనసాగాయి. ఎన్నికల సంఘం నిబంధనలన్నిటినీ ఉల్లంఘించిన ఏకైక పార్టీగా వైసిపి ఉంది. ఉద్యోగులు, ప్రభుత్వ సిబ్బందితో రహస్య సమావేశాలు, రూ.లక్షల డబ్బు పంపిణీతో అడ్డంగా ఆ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ కన్నంలో తేలుకుట్టిన దొంగలా దొరికిపోతూనే ఉన్నారు. అయినా సరే డబ్బు పంపకాలకు వెనుకాడడం లేదు. ప్రలోభాలు, ప్రాపకాలు, పంపకాలతో వైసిపి చెలరేగిపోతోంది. బిజెపి అభ్యర్థి పివిఎన్.మాధవ్ సైతం ఈ ఎన్నికల్లో డబ్బు పంపకాలకు తెర తీశారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల నుంచి పట్టభద్రులకు చేరాల్సిన తాయిలాల విషయంలో మధ్యలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తల ఆమ్యామ్యాయాలు అధికంగా ఉన్నాయన్న చర్చ ఆదివారం సాయంత్రానికి ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి వినిపించింది.

ఓటును అంకె ద్వారానే వేయాలి

మొదటి ప్రాధాన్యతా ఓటును అంకె ద్వారానే వేయాలి. 1 నుంచి 37 వరకూ ప్రాధాన్యతా క్రమంలో వేయొచ్చు. ఉదాహరణకు 11వ సీరియల్ నెంబరుగల పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు ఓటేయాలని అనుకుంటే ఆమె పేరుకు ఎదురుగా 1 అని నెంబరు వేసి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి.



ఆర్‌టిసి బస్సులో ఎన్నికల విధులకు వెళ్తున్న సిబ్బంది



నిరసన తెలుపుతున్న పిడిఎఫ్ మద్దతుదారులు

వైసిపి బరితెగింపు

మద్దతుదారులు డబ్బులు పంపిణీ చేస్తున్న వ్యక్తిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మరికొంత మంది పారిపోయి తప్పించుకున్నారు. ఓటర్ల జాబితా పట్టుకొని ఓటుకు వెయ్యి రూపాయలు చొప్పున పంపిణీచేస్తూ పట్టుబడ్డ కొల్లి ఈశ్వరరావు అనే వైసిపి కార్యకర్త వైసిపి కార్యాలయం నుంచే లక్ష రూపాయలు తెచ్చినట్లు పోలీసులు, సీతమ్మధార తహశీల్దార్ శ్యామ్‌కుమార్ ముందు తెలిపాడు. లక్ష రూపాయల్లో 17 మంది ఓటర్లకు వెయ్యి చొప్పున 17 వేలు ఇచ్చాడు. మిగిలిన 83 వేలతో దొరికిపోవడంతో సీజ్‌చేసి పోలీసులు కేసు నమోదుచేశారు. పట్టభద్రుల ఓటర్లలో డబ్బులు తీసుకొని ఓటేసే వారిని వాలంటీర్ల ద్వారా గుర్తించి, వారికి వైసిపి కార్యకర్తలతో పట్టపగలు డబ్బులు పంపిణీచేసే దిగజారుడుతనానికి వైసిపి దిగింది. ఓటర్‌ను బట్టి ఐదు వందల నుంచి వెయ్యికి పైగా పంపిణీ చేశారు. సుధాకర్ క్యాంపు కార్యాలయంలో ఓటర్లకు వెండి నాణేల పంపిణీకి ప్యాకింగ్ చేసిన వ్యవహారం బయటపడకుండా అధికార యంత్రాంగం కాపాడింది. చివరకు అక్కడ కరపత్రాలున్నాయని తేల్చి వారి అక్రమాలను సమర్థించేలా వ్యవహరించిందన్న విమర్శలు బలంగావున్నాయి. అంతకు కొన్ని రోజుల ముందు దసపల్లా హోటల్లో ప్రయివేటు డిగ్రీ కళాశాల కరస్పాండెంట్లతో ఎయు విసి ప్రసాద్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశం నిర్వహించినట్లు వీడియోలతో సహా బయటపడినా విచారణలో ఆయన్ను రక్షించారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ విజయం తథ్యమన్న ప్రచారం బలంగావుండడం, అనేక తరగతుల పట్టభద్రులు ఆమెను బలపర్చడంతో అక్రమ పద్ధతులకు అధికార వైసిపి దిగింది. సోమవారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనర్హులతో ఓట్లు వేయించేందుకు కూడా సిద్ధపడుతోంది.

గాజువాక : నియోజకవర్గం మొత్తం వైసిపి నేతలు ఓట్ల కోసం డబ్బులు పంచారు. పార్టీ వార్డు అధ్యక్షులు, కార్పొరేటర్లు దీనికి నాయకత్వం వహించారు. గాజువాక టిఎన్ఆర్ క్యాంపస్ వద్ద డబ్బులు పంపిణీ చేస్తుండగా సిఐటియు నాయకులు జి.శ్రీనివాసరావు స్థానిక న్యూ పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సబ్ ఇన్‌స్పెక్టర్ వచ్చి అక్కడేమీ జరగలేదని చెప్పి వెళ్లిపోయారు. కానీ వెయ్యి రూపాయలు పంపిణీ చేసినట్టు ఒక మహిళా ఓటరు తెలిపారు. ఇక్కడా పోలీసులు కన్నెత్తి చూడలేదు.

విశాఖపట్నం : కరాస, కప్పరాడ, కంచరపాలెం ప్రాంతాల్లో వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు డబ్బులు పంపిణీ చేశారు. ఫోన్ పే, గూగుల్ పే ద్వారానూ డబ్బులు ఓటర్లకు పంపిణీ చేసినట్టు తెలిసింది.

జి20 పనుల్లో పైపై మెరుగులు?

ప్రజాశక్తి -భీమునిపట్నం : విశాఖ వేదికగా ఈ నెల 28, 29 తేదీల్లో జి-20 దేశాల సదస్సు జరగబోతుంది. రాష్ట్ర ప్రభుత్వం దీన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. విదేశీ ప్రతినిధుల మన్ననలు పొందేందుకు వీలుగా నగరంతో పాటు ఆనుకుని ఉన్న భీమిలి బీచ్ రోడ్డును సుందరంగా తీర్చిదిద్దేందుకు రూ.135 కోట్లు కేటాయించిన విషయం విదితమే. ఈ నిధుల్లో భీమిలి బీచ్ రోడ్డు అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు జివిఎంసి రూ.2.71 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. రోడ్డుకు ఇరువైపులా డివైడర్లకు రంగులు, ఫుట్‌పాత్‌లకు హంగులు, గోడలకు విభిన్న తరహా బొమ్మలతో కూడిన వాల్ పెయింటింగ్‌లు, పవర్ బ్లాక్స్ ఏర్పాటు లాంటి సుందరీకరణ పనులు జరుగుతున్నాయి. శాఖా గ్రంథాలయం ఎదురుగా వినియోగంలో లేని బస్టాప్‌కు గ్రానైట్ రాయితో తీర్చిదిద్దుతుండడంపై పలువురు విస్మయం వ్యక్తంచేస్తున్నారు.



ఫుత్‌పాత్‌పై వేస్తున్న రంగులు

పనుల్లో కొరవడ్డ నాణ్యత?

సుందరీకరణ పనుల్లో నాణ్యత కొరవడిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇందుకు కారణాలు ఏమైనా కావొచ్చు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆయా కాంట్రాక్టర్లపై సంబంధిత అధికారుల ఒత్తిడి కూడా ఓ కారణమై ఉండొచ్చని కొందరు వ్యాఖ్యా నిస్తున్నారు. ఫుట్‌పాత్‌లపై చేరిన మట్టిని పూర్తిగా తొలగించకుండానే తూ తూ మంత్రంగా బ్రెష్‌తో పెయింటింగ్ వేస్తున్నట్లు బీచ్‌కు వచ్చే పలువురు సందర్శకులు, పర్యాటకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రాధాన్యతను విస్మరించి పనులు జరుగుతున్నాయని చెప్పుకుంటున్నారు. కొంతమంది ఇంజినీరింగ్ అధికారులు, కొద్దిమంది కాంట్రాక్టర్లతో ఓ అవగాహన కుదుర్చుకోవడం కూడా పనుల్లో నాణ్యత కొరవడడానికి మరో కారణంగా పలువురు అభిప్రాయ పడుతున్నారు. విపరీతమైన పని ఒత్తిడి వల్ల అభివృద్ధి, సుందరీకరణ పనుల పర్యవేక్షణ కష్టమవుతోందని కొందరు ఇంజినీరింగ్ అధికారులు వాపోతున్నారు. అనివార్యంగా ఒత్తిడి ప్రభావం పనుల నాణ్యతపై పడుతుందనేది వాస్తవం.

నాణ్యతపై అనుమానాలు

ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ కరువు



తూతూ మంత్రంగా అమరుస్తున్న పవర్ బ్లాక్స్

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో సిఐటియు నాయకుడు మృతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : కూర్మన్నపాలెంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సిఐటియు నాయకుడు యజ్జల వైకుంఠరావు (51) మృతిచెందారు. పోలీసుల కథనం ప్రకారం... ఆదివారం ఉదయం స్టీల్‌ప్లాంట్ రోడ్డులో వైకుంఠరావు వాకింగ్ చేస్తున్న సమయంలో చైతన్య కళాశాల సమీపంలో పాల వ్యాన్ ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన వైకుంఠరావును హుటాహుటిన కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. 1993లో ఉద్యోగం చేరినప్పటి నుంచి సిఐటియులో కార్యకర్తగా, నాయకునిగా పనిచేసే పలువురి మన్ననలు పొందారు. ఆయన కూర్మన్నపాలెంలో నివాసముంటున్నారు. ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. వైకుంఠరావు స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా బారువ. స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్ విభాగంలో జనరల్ ఫోర్‌మ్యాన్‌గా పనిచేస్తున్నారు. వైకుంఠరావు మంచి ఉద్యోగిగా, సిఐటియుకు బలమైన నాయకునిగా, త్రిఫ్ట్ సొసైటీ మాజీ డైరెక్టర్‌గా, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటంలో ముందుండి నడిచారు. ప్రస్తుతం సెంట్రల్ ఆఫీస్ బేరర్‌గా పనిచేస్తున్నారు. ఆయన మృతి వార్త విని కార్మికులు, ఉద్యోగులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. అందరితో కలిసి మెలిసి పనిచేసిన వ్యక్తి మరణించడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ప్రమాద వార్త విన్నవెంటనే సిఐటియు స్టీల్ జోన్ గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, శ్రీనివాసరాజు తదితరులు కెజిహెచ్‌కు చేరుకున్నారు. ఆయన మృతి పట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైకుంఠరావును ఢీకొన్న పాల వ్యాన్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



కబ్జాదారుల నుంచి రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి,-ఎంవిపి కాలనీ : తన ఇంటిని గోవింద అనే వ్యక్తి అన్యక్రాంతం చేయాలని చూస్తున్నాడని, రక్షణ కల్పించాలని ఆస్ట్రేలియాలో నివసముండే విశాఖ నగరానికి చెందిన దమ్మి శ్రీనివాస్ కోరారు. శివాజీపాలెంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో దమ్మి శ్రీనివాస్ మాట్లాడుతూ, తాను 2017 సంవత్సరంలో గోవింద అనే వ్యక్తికి తన ఇంటిలోని పైభాగాన్ని రూ.30 లక్షలకు అమ్మేశానని తెలిపారు. అనంతరం తాను ఆస్ట్రేలియా వెళ్ళిపోతూ తన కింద భాగానికి అద్దె వసూలు చేయమని చెప్పానని వివరించారు. తాను 2022లో తిరిగి ఆస్ట్రేలియా నుంచి వచ్చేనాటికి తన ఇంటిని ఆయన స్వాధీనం చేసుకొని కింది భాగానికి రూ.15 లక్షలు ఇస్తానని, ఇల్లు తనకు అమ్మాలని బెదిరిస్తున్నాడని తెలిపారు. దీనిపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇది సివిల్ కేసు అని, కోర్టు పరిధిలో పరిష్కరించుకోవాలని సూచించారని చెప్పారు. తనకు గోవింద్ నుంచి రక్షణ కల్పిస్తూ న్యాయం చేయాలని పోలీసులను కోరారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం జంక్షన్లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 250 మంది పాల్గొని వైద్య పరీక్షలు చేయించు కున్నారు. పద్మనాభం మండలం ఆర్ఎంపి వైద్యుల సహకారంతో ఏర్పాటుచేసిన శిబిరంలో విజయనగరం సాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు సేవలందించారు. శిబిరాన్ని ఎంపిపి రాంబాబు ప్రారంభించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన వారిలో కొంతమందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి వారికి 50 శాతం రాయితీపై ఆపరేషన్లు చేయడానికి ప్రత్యేక కార్డులను అందజేశారు. ఈ శిబిరంలో రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు కోరాడ లక్ష్మణ, నాయకులు పద్మనాభస్వామి, సన్యాసినాయుడు, ఈశ్వరరావు, ఆదిబాబు పాల్గొన్నారు.

లక్ష్యం ఉన్నతంగా ఉండాలి



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న నర్సింగరావు

ప్రజాశక్తి -తగరపువలస : మనం ఎంచుకున్న లక్ష్యం ఉన్నతంగా ఉండాలని స్థానిక శ్రీ కృష్ణా జూనియర్ కళాశాల చైర్మన్ బి.నరసింగరావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. చిట్టివలస బొగ్గు రోడ్డులో ఉన్న శ్రీ కృష్ణా జూనియర్ కళాశాలలో ఆదివారం ఫేర్‌వెల్‌డే వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. వేడుకలను జ్యోతి వెలిగించి ప్రారంభించిన కళాశాల చైర్మన్ నరసింగరావు మాట్లాడుతూ, కఠోర శ్రమ ద్వారానే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని విద్యార్థులకు స్పష్టం చేశారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని వారికి సూచించారు. దేశ భక్తి, క్రమ శిక్షణ, నైతిక విలువలు అలవర్చుకున్నప్పుడే సమాజంలో గౌరవ స్థానం దక్కుతుందన్నారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నరసింగరావు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ ప్రిన్సిపల్ రాజేష్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ తాతారావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జె.సతీష్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

తవ్వేసి వదిలేశారు

రామకృష్ణాపురంలో అధ్వానంగా రహదారులు

రెండేళ్లుగా ఇబ్బందులు పడుతున్న స్థానికులు

ప్రజాశక్తి - ఆరిలోవ : 13వ వార్డు పరిధి కేంద్రకారాగారం ఎదురుగా గల రామకృష్ణాపురంలో రహదారులు వేసేందుకు గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించారు. కాలువలు, యుజిడి పనులు పూర్తి చేశారు. తరువాత సాధారణ ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆపేశారు. ఎన్నికల తరువాత కొంతవరకు రహదారులు నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. రెండు ప్రధాన వీధుల్లో బిటి రోడ్డు నిర్మాణం చేపట్టారు. మిగతా వీధులను తవ్వేసి అలాగే వదిలేశారు. సుమారు రెండేళ్లు అయినా తిరిగి పనులు ప్రారంభించలేదు. అసంపూర్తి పనులతో వీధులన్నీ చిందరవందరంగా కనిపిస్తున్నాయి. చిన్న చిన్న రాళ్లు తేలిపోవడంతో స్థానికులు నడిచేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం వస్తే చాలు వీధులన్నీ బురదతో అధ్వానంగా మారి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికుల వాపోతున్నారు. యుజిడి పనులు పూర్తయినా ఇంకా ప్రధాన పైపు లైన్‌కు అనుసంధానం చేయలేదు. వర్షాకాలంలో లోతట్టు వీధులు ముంపునకు గురవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంకా పూర్తిచేయని రహదారులను పూర్తి చేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.



రామకృష్ణాపురంలో తవ్వి వదిలేసిన రహదారి



గైనకాలజీలో రోబోటిక్ సర్జరీ కార్యశాలలో మాట్లాడుతున్న అపోలో గైనకాలజీ వైద్య బృందం

గైనకాలజీలో రోబోటిక్స్ సర్జరీపై కార్యశాల

ప్రజాశక్తి - ఆరిలోవ,మధురవాడ : ఆరిలోవ హెల్త్‌సిటీ అపోలో ఆసుపత్రి, ఒజిఎస్‌వి సంయుక్త ఆధ్వర్యాన ఆదివారం సాగరతీరంలోని ర్యాడిసన్ హోటల్ సమావేశ మందిరంలో గైనాకాలజీలో రోబొటిక్స్ సర్జరీపై కార్యశాల నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి సారిగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 150 మంది ప్రతినిధులు, గైనాకాలజిస్టులు హాజరయ్యారు. సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ శశిప్రభ కార్యశాలను ప్రారంభించారు. హైదరాబాద్, జూబ్లీహిల్‌లో గల అపోలో ఆసుపత్రికి చెందిన డాక్టర్ రూమా, విశాఖపట్నం అపోలో ఆసుపత్రి గైనాకాలజిస్ట్‌లు, లాప్రోస్కోపిక్, రోబోటిక్ సర్జన్ల బృందంతో కలిసి డాక్టర్ కిరణ్మయి గొట్టాపు, డాక్టర్ శ్రీదేవి మట్టా, డాక్టర్ విద్యా కొండూరిలు రోబోటిక్ హిస్టెరెక్టమీ వంటి లైవ్ సర్జరీలను ప్రదర్శించారు. ఈ రంగంలో తమ అపారమైన అనుభవాన్ని ప్రతినిధులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిఇఒ, సిఒఒ వై.సుబ్రహ్మణ్యం, శ్రీరామచంద్ర మాట్లాడుతూ, రోగులకు అధునాతన చికిత్సలు అందించడంలో అపోలో హాస్పిటల్స్ ముందుంటాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనే మొట్టమొదటి సారిగా బినైన్ గైనకాలజీలో రోబోటిక్ సర్జరీని విశాఖలోని అపోలో ఆసుపత్రిలో డాక్టర్ కిరణ్మయి ఆధ్వర్యాన వైద్యులు విజయవంతంగా నిర్వహించారని తెలిపారు.

చలో ఢిల్లీలో మాజీ సైనికులు

ప్రజాశక్తి -తగరపువలస : తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12న జంతర్ మంతర్ వద్ద జరిగిన చలో ఢిల్లీ కార్యక్రమంలో పలువురు మాజీ సైనికులు పాల్గొన్నట్లు ఎపి మాజీ సైనికుల హక్కుల హక్కుల పోరాట సమితి ఆర్గనైజింగ్ సెక్రటరీ చిల్ల వెంకటరెడ్డి ఆదివారం తెలిపారు.

వన్‌టౌన్‌లో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : వన్ టౌన్‌లోని మెయిన్ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. దాదాపు దశాబ్ద కాలంగా ఈ రోడ్డును వెడల్పు చేసి అభివృద్ధి చేయాలని స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తీవ్ర ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. జగదాంబ జంక్షన్ నుంచి వన్ టౌన్ పోలీస్ స్టేషన్, క్వీన్ విక్టోరియా విగ్రహం వరకు ఉన్న రోడ్డును 100 అడుగుల వెడల్పుతో విస్తరించి, అభివృద్ధి చేయాలని భావించారు. అయితే రోడ్డు విస్తరణలో షాపులు భవనాలు కోల్పోయేవారు 100 అడుగుల వెడల్పుతో విస్తరణకు అభ్యంతరం తెలిపారు. కొందరు కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే గణేష్ కుమార్ వీరందరితో పలుమార్లు సమావేశాలు నిర్వహించి, రోడ్డు వెడల్పు విస్తరణతప్పదని, ఇందుకు అందరూ సహకరించాలని కోరుతూ వచ్చారు. ముందుగా100 అడుగుల వెడల్పుకు భవనాల మార్కింగ్ చేశారు. దానిని 80 అడుగులకు తగ్గించి మరోసారి మార్కింగ్ చేశారు. అయినప్పటికీ అందరి ఆమోదం లభించలేదు. దీంతో 60 అడుగుల వెడల్పుతో విస్తరణకు అందరూ అంగీకరించారు. విస్తరణ సమస్య 60 అడుగులకు కటాఫ్ అవడంతో భవన యాజమానులు సంతోషం వ్యక్తం చేశారు. 60 అడుగుల వెడల్పుతో విస్తరణ అంగీకారం కావడంతో జగదాంబ జంక్షన్ నుంచి కాకుండా పూర్ణ మార్కెట్ జంక్షన్ నుంచి 60 అడుగుల వెడల్పుతో రోడ్డు విస్తరణను ప్రారంభించారు. మాస్టర్ ప్లాన్‌లో కూడా 60 అడుగులతోనే రోడ్డు విస్తరణకు జివిఎంసి జోన్-4 అధికారులు ప్లాన్ రూపొందించారు. రోడ్డు విస్తరణలో దుకాణాలు కోల్పోయిన భవన యాజమానులకు జీవీఎంసీ టిడిఆర్‌లు సిద్ధం చేసింది. మొత్తం ఈ విస్తరణలో 204 దుకాణాల వరకు దెబ్బ తింటున్నాయి. ముఖ్యంగా పూర్ణామార్కెట్ నుంచి ఈ విస్తరణ జరుగుతోంది. ఇప్పటికే కొందరు భవన యాజమానులు వారి డాక్యుమెంట్స్ జీవీఎంసీకి ఇచ్చి టిడిఆర్‌లు పొందారు. మిగిలిన వారందరూ జీవీఎంసీ జోన్ -4లో దరఖాస్తు చేసుకుంటే వెంటనే వారికి టిడిఆర్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు.

అనుకున్న విధంగా రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే, పూర్ణ మార్కెట్ నుంచి విక్టోరియా రాణి విగ్రహం వరకు ఉన్న రోడ్డు బాగా అభివృద్ధిజరిగి, అన్ని రకాల రాకపోకలకు ఎంతో అనువుగా ఉంటుందనడంలో సందేహం లేదు. ముఖ్యంగా ఈ మార్గంలో ప్రసిద్ధి చెందిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రాంతం, రీడింగ్ రూమ్, టౌన్ హాల్, కురుపాం మార్కెట్, శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం, వంటి ప్రాంతాలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

టిడిఆర్‌లు అందరూ తీసుకోవాలి

రోడ్డు విస్తరణలో షాపులు, భవనాలు కొంత కొంతమేర కోల్పోతున్న వారంతా టిడిఆర్‌లు తీసుకోవాలి. ఈసరికే కొందరు టిడిఆర్ లు తీసుకున్నారు. తీసుకోని వారంతా జీవీఎంసీ కమి షనర్ పేరుతో దరఖాస్తు చేసుకుంటే, వెంటనే వారికి టిడిఆర్‌లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం.


-వినయ్ ప్రసాద్,
ఇన్‌ఛార్జి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్,
జోన్-4



మీడియాతో మాట్లాడుతున్న చిత్ర యూనిట్ సభ్యులు

కథ వెనుక కథ చిత్ర బృందం సందడి

ప్రజాశక్తి- కలెక్టరేట్, విశాఖ : దండమూడి బాక్స్ఆఫీస్ పతాకంపై దండమూడి అవనీంద్ర కుమార్ నూతనంగా నిర్మించిన కథ వెనుక కథ చిత్రం యూనిట్ నగరంలో సందడి చేసింది. నగరంలోని ఓ హోటల్లో ఇన్‌స్టాగ్రామ్ ఇన్ఫ్లుయెన్సర్స్‌తో చిట్ చాట్ చేశారు. అనంతరం చిత్ర బృందం మీడియాతో మాట్లాడింది. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గొట్టిపాటి సాయి మాట్లాడుతూ, కథ వెనుక కథ చిత్రం ఈనెల 24న విడుదలకు సిద్ధమైందని తెలిపారు. ఆద్యంతం అందరినీ ఆకట్టుకునే సస్పెన్స్ థ్రిల్లర్‌గా దీన్ని రూపొందించామని చెప్పారు. అన్ని తరగతుల ప్రేక్షకుల్ని ఆకట్టుకునే విధంగా ఈ సినిమాని తీర్చిదిద్దినట్లు తెలిపారు. అనంతరం చిత్ర హీరో (ఓ పిట్టకథ ఫేమ్) విశ్వంత్ మాట్లాడుతూ, తన కెరియర్లో ఈ చిత్రం ఒక మైలురాయిలుగా నిలుస్తుందన్నారు. ఇంతకుముందు ఎప్పుడూ చెయ్యని వినూత్నమైన పాత్రను ఇందులో పోషించానన్నారు. కమెడియన్ మధునందన్ మాట్లాడుతూ పలు చిత్రాల్లో నటించిన తాను, ఈ చిత్రంలో వైవిధ్యభరితమైన పాత్రను పోషించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో చిత్ర దర్శకుడు కృష్ణ చైతన్య, హీరోయిన్లు శ్రీజిత ఘోష్, శుభశ్రీ మాట్లాడుతూ, ఈ చిత్రాన్ని ఆదరించి విజయవంతం చేయాలని కోరారు.


గాజువాక సమస్యలపై ఎమ్మెల్సీకి వినతిపత్రం అందిస్తున్న బలిరెడ్డి తదితరులు

గాజువాక సమస్యలపై ఎమ్మెల్సీకి వినతి

ప్రజాశక్తి -గాజువాక : గాజువాకలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావుకు అగనంపూడి టిడిపి నాయకులు వినతిపత్రం అందజేశారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమిటో చెప్పాలని కోరారు. గంగవరం పోర్టులో రాష్ట్ర ప్రభుత్వం ఆదాని గ్రూపును అమ్మిన 10 శాతం వాటాలు ఉపసంహరించుకోవాలని కోరారు. అగనంపూడి వద్ద ఉన్న టోల్ ప్లాజాను మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నాయకత్వంలో తొలగించారని తెలిపారు. మళ్లీ టోల్ గేటు పెడితే వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. విశాఖపట్నంలో అత్యధిక కార్మికులు ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత కార్మిక శాఖ భవనం నిర్మించాలని కోరారు. దీనిపై దువ్వారపు రామారావు స్పందిస్తూ ఈ సమస్యలను శాసన మండలి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. వినతి ఇచ్చిన వారిలో టిడిపి నాయకులు నెల్లి శ్రీనివాసరావు, కోసిపల్లి శ్రీనివాసరావు, బి.ప్రసాదరావు పాల్గొన్నారు.

మరిడిమాంబ ఆలయానికి శరగడం విరాళం

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 96వ వార్డు పరిధి పాత పెందుర్తిలో మరిడిమాంబ ఆలయాన్ని శరగడం చిన అప్పల నాయుడు ఆదివారం సందర్శించారు. నిర్మాణంలో ఉన్న ఆలయానికి రూ.4 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఆలయ అభివృద్ధికి నా సహాయ సహకారాలుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేగి శ్రీనివాసరావు, గొర్లె రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చిన అప్పలనాయుడు

18 ఏళ్లకు తీరిన గృహ రుణభారం



ఇళ్ల పట్టాలు, లోన్ క్లియరెన్స్ పత్రాలను అందజేస్తున్న వార్డు కార్పొరేటర్ నాగేశ్వరరావు, బ్యాంక్ అధికారులు

ప్రజాశక్తి- ములగాడ : జివిఎంసి 40వ వార్డు పరిధి ఎకెసి కాలనీలో 2006 సంవత్సరంలో వాంబే గృహ నిర్మాణ పథకం ద్వారా 316 ఇళ్లను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ప్రభుత్వం సబ్సిడీతో నిర్మించారు. అప్పట్లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా రూ.25 వేల రుణం ఇచ్చారు. ఈ 18 సంవత్సరాలలో వడ్డీతో లబ్ధిదారులు రూ.లక్ష కట్టాల్సి ఉంది. వన్ టైం సెటిల్‌మెంట్ కింద 10 శాతం కడితే చాలని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రకటించింది. దీంతో 316 మంది లబ్ధిదారులు రూ.2500 చొప్పున చెల్లించి రుణ విముక్తులయ్యారు. రెవెన్యూ పట్టా, లోన్ క్లియరెన్స్ సర్టిఫికెట్, రసీదులను వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు చేతుల మీదుగా లబ్ధిదారులకు బ్యాంకు ప్రతినిధులు అందజేశారు. అనంతరం కార్పొరేటర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పేద ప్రజలకు ఇలాంటి అనేక కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటోనగర్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గాజువాక బ్రాంచ్ మేనేజర్ అప్పారావు, చీఫ్ మేనేజర్ ఎఎస్ఆర్.పంతులు, అసిస్టెంట్ మేనేజర్లు శ్రీనివాసరావు, వెన్నెల, 40 వార్డు వైసిపి అధ్యక్షులు వరపల మహేష్ కన్వీనర్లు దండి శ్యామ్, శరగడం గంగరాజు, గృహ సారథులు గురుగుబిల్లి బైరగి తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ముత్యాలు

ఆటలతో ఆరోగ్యం

ప్రజాశక్తి -గాజువాక : ఆటలతో మనిషి ఆరోగ్యంగా ఉండవచ్చునని కాంగ్రెస్ గాజువాక సమన్వయకర్త జెర్రిపోతుల ముత్యాలు అన్నారు. నడుపూరు గ్రామదేవత, పైడిమాంబ అమ్మవారి మహోత్సవం సందర్భంగా పైడిమాంబ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యాన ఆదివారం జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ముత్యాలు ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చెల్లుబోయిన నాయుడు, జనసేన నాయకులు, పితాని భాస్కరరావు, రౌత్ గోవింద్, పైడిమాంబ ఉత్సవ కమిటీ సభ్యులు బత్తిన నాగభూషణం, తెలుగుదేశం నాయకులు బొడ్డు కృష్ణారావు, ఉత్సవ కమిటీ కోశాధికారులు గెద్దం రమణ, భాను, పితాని పాత్రుడు, పాములు ఉమ, స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు పూడి సన్ని, పల్లం రవి పాల్గొన్నారు.

14న సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి-సిరిపురం : ప్రముఖ సినీ సంగీత దర్శకులు కెవి.మహదేవన్ జయంతి సందర్భంగా ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్, అమ్మానాన్న సూర్య ప్రకాశరావు మెమోరియల్స్ ఆధ్వర్యాన ఈ నెల 14వ తేదీన విశాఖ పౌర గ్రంథాలయంలో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు హైకోర్టు న్యాయవాది, ఆయా సంస్థల అధ్యక్షులు ఎస్ఎన్‌కె మహంతి తెలిపారు. రామ్ నగర్‌లో ఉన్న ట్రస్టు కార్యాలయంలో రాష్ట్ర శిష్ట కరణం కార్పొరేషన్ చైర్ పర్సన్ అనూషా పట్నాయక్ ఆదివారం ఉదయం కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎన్‌కె.మహంతి మాట్లాడుతూ, రెండున్నర దశాబ్దాలుగా గాన మాధుర్యంతో అలరిస్తున్న జామి శివ అప్పలరాజుకు స్వర కళా పురస్కారం అవార్డు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. 14వ తేదీ సాయంత్రం 6 గంటలకు పౌర గ్రంథాలయంలో నగరానికి చెందిన గాయనీ గాయకులు కెవి మహదేవన్ స్వర పరచిన చిత్ర గీతాలు ఆలపిస్తారని పేర్కొన్నారు. కళా కారులు, సంగీత ప్రియులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా భాస్కర్ విద్యానికేతన్ వార్షికోత్సవం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక చట్టివానిపాలెంలోని భాస్కర్ విద్యానికేతన్‌లో ఆదివారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు, కరెస్పాండెంట్ రమాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జివిఎంసి జోన్ 6 కమిషనర్ పి.సింహాచలం ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. యుకెజి విద్యార్థులకు స్నాతకోత్సవం నిర్వహించి పట్టాలు అందజేశారు.

గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవిస్తూ చదువులో రాణించి అందరికీ మంచిపేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. జిల్లా ఉపవిద్యాశాఖాధికారి ఎ.గౌరీశంకరరావు మాట్లాడుతూ, 10వ తరగతి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు పరీక్షలపై పలు సూచనలు చేశారు. అనంతరం అతిథులచే గతంలో 10వ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తల్లిదండ్రులను సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు, నాటికలు, కరాటే ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు, చట్టి గోపి, వివిధ పాఠశాలల కరెస్పాండెంట్లు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి -భీమునిపట్నం : నేడు జరుగనున్న ఉత్తరాంధ్ర పట్ట భద్రుల శాసన మండలి ఎన్నికలు నేపథ్యంలో స్థానిక జివిఎంసి ఎంపిపి యుపి పాఠశాలలో ఏర్పాటు చేసిన 295, 296 పోలింగ్ కేంద్రాలను మధురవాడ పోలీస్ సబ్ డివిజన్ ఎసిపి శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు బందోబస్తు ఏర్పాట్లపై స్థానిక సిఐ కె.లక్ష్మణమూర్తితో చర్చించారు. ఎస్ఐ హరీష్ పాల్గొన్నారు.

అదనంగా పెరిగిన పోలింగ్ కేంద్రం

చిట్టివలస జివిఎంసి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ హైస్కూల్‌లో అదనంగా మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటుచేశారు. ఇదివరకు 297వ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయగా, ఓటర్ల సౌలభ్యం దృష్ట్యా 297 (ఎ) పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేసినట్లు ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ కె.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు.

ఎన్నికల నిబంధనలు విధిగా అమలు చేయాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : నిబంధనలు సక్రమంగా పాటించడం ద్వారా ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవిసుభాష్ పట్టన్‌శెట్టి ఆదేశించారు. ఆదివారం స్థానిక ఎఎంఎఎల్ హైస్కూల్లో ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రిని పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పోలింగ్ అధికారులు, సిబ్బందితో మాట్లాడుతూ డైరీలో సూచించిన విధంగా ఇచ్చిన ఆదేశాలను పోలింగ్ అధికారి ఎప్పటికప్పుడు పాటిస్తూఅమలు చేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా పారదర్శకంగా పూర్తి చేయాలన్నారు. పోలింగ్ సిబ్బందికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆర్‌డిఒలు, తహశీల్దార్లు తగిన ఏర్పాట్లు చేశారన్నారు. పోలింగ్ ప్రక్రియ వెబ్ కాస్ట్ జరుగుతుందని, ప్రిసైడింగ్ అధికారి అనుమతి లేనిదే ఎవరిని లోనికి అనుమతించరాదన్నారు. జిల్లాలోని 49 పోలింగ్ కేంద్రాలకు 10 రూట్లలో సమకూర్చిన పది బస్సులలో పోలింగ్ సామగ్రిని తీసుకొని సిబ్బంది, పోలింగ్ అధికారులు బస్సుల్లో తరలి వెళ్లారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ వెంకటరమణ, అనకాపల్లి నర్సీపట్నం ఆర్డీవోలు చిన్ని కృష్ణ, జయరాం, డ్వామా పిడి సందీప్, ప్రత్యేక ఉప కలెక్టర్లు జ్ఞాన వేణి, రమామణి, కలెక్టర్ ఆర్డీవో కార్యాలయాల పరిపాలన అధికారులు శ్రీనివాసరావు నరసింహమూర్తి గంగాధర్ రావు, సెక్షన్ సూపర్ ఇంటెండెంట్ లక్ష్మీదేవి, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్నికల సామగ్రితో తరలి వెళ్తున్న సిబ్బంది



పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

20న ఎఫ్ఎం బాబాయ్‌కు సత్కారం

ప్రజాశక్తి -మునగపాక రూరల్: ఈనెల 20న దాడి త్రినాధస్వామి (ఎఫ్ఎం బాబాయ్)ని సత్కరిస్తున్నట్లు గ్రామీణ యువజన సాంస్కృతిక సంస్థ కన్వీనర్ సూరిశెట్టి రాము ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక నందీశ్వర కళా ప్రాంగణం వేదికపై 20న సాయంత్రం.దాదాపు 125 సినిమాల్లో నటించి, 500కు పైగా కామెడీ షోలు, 25 పైగా షార్ట్ ఫిలింలు, 200కు పైచిలుకు రంగస్థల ప్రదర్శనలు 164 పరిషత్తు నాటక పోటీల్లో పాల్గొని, 162సార్లు ఉత్తమ పాత్రధారిగా ప్రతిభ కనబరిచి, 400కు పైగా సన్మానాలు, అభినందనలు పొందడమే కాకుండా ఇటీవల 'దహనం' చిత్రంలో నటించి అందరి మన్ననలు పొందిన ఎఫ్ఎం బాబాయ్‌ను అభినందించి, సత్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం భూమిక థియేటర్ గ్రూప్ హైదరాబాదు వారిచే 'బరిబత్తుల రాజు'అనే సాంఘిక నాటిక ప్రదర్శిస్తామన్నారు. కళాకారులు, కళాభిమానులు విచ్చేసికార్యక్రమాలను జయప్రదం చేయాలని రాము కోరారు.


ఎల్ఐసి శివ అకాల మరణం

ప్రజాశక్తి-.అనకాపల్లి : ఎల్ఐసి శివగా పట్టణ ప్రజలకు సుపరిచితులైన విశ్రాంత ఎల్ఐసి డెవలప్‌మెంట్ అధికారి పెతకంశెట్టి శివవెంకట సత్యనారాయణ ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయన జార్జిక్లబ్ అధ్యక్షునిగా, ఉపాధ్యక్షులుగా కార్యదర్శిగా పనిచేశారు. గవరపాలెం దిబ్బావీధి సీతారామస్వామి ఆలయం, నాగేంద్ర దేవస్థానం ఛైర్మన్‌గా వ్యవహరించారు. ఎల్ఐసిలో పాలసీల సేకరణలో చూపిన ప్రతిభ ఆధారంగా.1989లో బీమా కోటీశ్వరునిగా ఎల్ఐసి బిరుదు అందుకున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎల్ఐసి శివ మృతి పట్ల జార్జి క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బుద్ద కాశీ విశ్వేశ్వరరావు, మల్ల చంద్రశేఖర్, కోశాధికారి ఆళ్ల నూకేశ్వరరావు, ఇతర సభ్యులు సంతాపం ప్రకటించారు.

'అమ్మ' ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకం

ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి- కె. కోటపాడు: అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో కొనసాగుతున్న సేవలు అభినందనీయం, స్ఫూర్తిదాయకమని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఆదివారం ఎ.కోడూరు జెడ్‌పి హైస్కూల్లో ట్రస్ట్ ఆధ్వర్యంలోఏర్పాటు చేసిన మెగా రక్త దాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం రక్త దాతలకు ప్రశంస పత్రాలు, మెమొంటోలను అందజేశారు. శిబిరంలో 58మంది యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయడాన్ని అభినందించారు. ఈ సందర్భంగా బూడి మాట్లాడుతూ, మహిళల కాన్పులు, తీవ్ర అనారోగ్యం, ఆపరేషన్లు, ప్రమాదాలు వంటి సందర్భాల్లో రోగుల ప్రాణాలను కాపాడాలంటే రక్తం ఎంతో అవసరమని, అటువంటప్పుడు ఇలాంటి శిబిరాల ద్వారా సేకరించిన రక్తం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి పాల్గొన్న ఉపముఖ్యమంత్రి బూడిముత్యాలనాయుడు, ఇతర నేతలతోపాటు స్వచ్ఛందంగా వచ్చి రక్తాన్ని ఇచ్చిన దాతలకు తమ ట్రస్ట్ తరపున ఛైర్మన్ గొంప వెంకటరావు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి అనురాధ, ఎంపిపి రెడ్డి జగన్మోహన్, పైలా ప్రసాదరావు, స్థానిక ఎంపిటిసి, సర్పంచ అమ్మ బ్లడ్ బ్యాంక్ ఎండి వినోద్‌బాబు,, హెచ్ఎం అనురాధ, ఉపాధ్యాయులు సూరెడ్డి బాబురావు, లెక్కల ఎరుకునాయుడు, లెక్కల కోటేశ్వరరావు , సెక్రెటరీ సింగంపల్లి అచ్చిబాబు, లెక్కల సత్యనారాయణ, వైస్ ఛైర్మన్ సింగంపల్లి అర్జున, ట్రస్ట్ సభ్యులు ఆర్‌కె. నాయుడు, సింగంపల్లి రామారావు, లెక్కల శ్రీధర్, లెక్కల మధు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఉపముఖ్యమంత్రి బూడి

వివాహ చట్టాలపై అవగాహన అవసరం

సెమినార్ ముగింపులో ప్రొఫెసర్ రాకా ఆర్య



ప్రొఫెసర్ రాక్యా ఆర్యకు సత్కారం

ప్రజాశక్తి.-సబ్బవరం : సహ జీవనం: వివాహం, వివాహ చట్టాలపై సమాజంలోని ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమనిఛైర్మన్ లా కమిషన్ ఆఫ్ ఇండియా సభ్యుడు, ఎన్ఎల్‌యు, ప్రొఫెసర్ రాకా ఆర్య అన్నారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయంలో సెంటర్ ఫర్ ఉమెన్ అండ్ చైల్డ్ లా అధ్వర్యంలో 'సహ జీవనం: వివాహం, వివాహ చట్టాలపై ప్రభావం' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సెమినార్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశసంస్కృతి గురించి నేటితరం పరిశోధించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇగ్నో ప్రొఫెసర్ దుర్గేష్ నందిని, ఎంపిలా కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.ఎం.రావు మాట్లాడారు. ఈ సందర్భంగా డిఎల్ఎన్‌యు ఉప కులపతి ప్రొఫెసర్ ఎస్.సూర్యప్రకాష్ సెమినార్‌లో పాల్గొన్న అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రెండు రోజుల సెమినార్ రిపోర్ట్‌ను సెంటర్ ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ విజయలక్ష్మి సమర్పించారు.సెంటర్ ఫ్యాకల్టీ మెంబర్ డాక్టర్ భాగ్యలక్ష్మి వందన సమర్పణ చేశారు. సెమినార్‌లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపికి బుద్ధి చెప్పండి

మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీష్



మాట్లాడుతున్న నాగ జగదీష్

ప్రజాశక్తి- అనకాపల్లి : రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మికులను అడుగడుగునా అణచివేస్తూ, అరాచక పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగజగదీశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక టిడిపి పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ప్రలోభాలతో ఓటర్లను మభ్యపెట్టకుండా, మోసపూరిత హామీలు ఇవ్వకుండా నిజాయితీగా ఎన్నికల బరిలో వైసిపి దిగితే తెలుగుదేశం పార్టీ కచ్చితంగా విజయం సాధిస్తుందన్నారు. ఓటర్ల నమోదు ప్రక్రియ మొదలుకుని, ఎన్నికలను సజావుగా నిర్వహించాల్సిన అధికారులు, రాజ్యాంగ వ్యవస్థలను కాపాడాల్సిన ఐఎఎస్ అధికారులు, పోలీస్ అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు నేడు ఎన్నికల వ్యవస్థపై నమ్మకం పోయేలా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఓటర్ల నమోదు నుంచి అనేక పొరపాట్లు జరిగాయన్నారు. ఇక టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబును జైలుకు పంపిస్తామని పదేపదే చెబుతున్న మంత్రి గుడివాడ అమర్నాథ్‌ను రానున్న ఎన్నికల్లో ఇంటికి సాగనంపేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ధూళిరంగనాయకులు, ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మహోన్నత నేత ఎన్‌టిఆర్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ

ప్రజాశక్తి.- అనకాపల్లి : ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని విశ్వవిఖ్యాతం చేసిన మరవిపోలేని మహోన్నత నేతగా, ఆంధ్రుల అన్నగా దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు తెలుగు ప్రజలమదిలో చిరస్మరణీయులుగా నిలిచిపోయారని, మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక బైపాస్ రోడ్డు సరుగుడు వ్యాపారుల సంక్షేమ భవనంలో అనకాపల్లి జిల్లా సీనియర్ ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షులు కొణతాల బాలనాగేశ్వరరావు అధ్యక్షతన ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ, తెలుగు చలనచిత్ర రంగంలో మకుటం లేని మహారాజుగా వెలుగొందిన ఎన్‌టిఆర్, తెలుగుదేశం పార్టీని స్థాపించి అతి తక్కువ కాలంలోనే ముఖ్యమంత్రిగా పీఠం అధిరోహించా రన్నారు. కూడు,గూడు, గుడ్డ నినాదంతో సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి, పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఈ ఏడాది మే 28న ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఫాన్స్ జిల్లా అధ్యక్షులు బాలనాగేశ్వరరావు వెల్లడించారు. కార్యక్రమంలో కర్రి దివాకర్, మళ్ల సురేంద్ర, ధనాల విష్ణు చౌదరి, పోలవరపు త్రినాథ్, కొణతాల శ్రీనివాసరావు, సిని ఎగ్జిబిటర్ మళ్ల వెంకటరావు, ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ, ఓల్డ్ ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మైక్‌సెట్ వితరణ



మైక్‌సెట్ అందజేస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని ఎ.కొత్తపల్లి గ్రామంలోని జై శ్రీరామ భజన బృందానికి అదే గ్రామానికి చెందిన ఎంప్లాయిస్ గ్రూప్ సమీకరించిన విరాళాలతో రూ.8500 విలువ చేసే మైక్, సౌండ్ సిస్టం వితరణ చేశారు. ఆదివారం స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ చేతుల మీదుగా భజన బృందానికి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ,. గ్రామాల్లో అందరూ ఐకమత్యంగా ఉండి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలని, తద్వారా గ్రామంలో శాంతి ప్రశాంతత నెలకొని అభివృద్ధికి ఆస్కారముంటుందన్నారు.

సంప్రదాయ కళారూపాలకు ఆదరణ

- వీధివేషాలు, వాలకాలను విశేషంగా ఆదరిస్తున్న గవర్ల అనకాపల్లి వాసులు
- వేషధారణలో పాల్గొంటున్న గృహిణులు

ప్రజాశక్తి -మునగపాక రూరల్: గ్రామీణ ప్రాంత ప్రాచీన కళలు, కళారూపాలు అనేక ప్రాంతాల్లో నేటికీ కనుమరుగౌతున్న పరిస్థితుల్లో వాటికి అక్కడక్కడా అరకొర ఆదరణ కల్పిస్తున్న గ్రామాలూ ఉన్నాయి. నేటి రోజుల్లోనూ ప్రాచీన సంప్రదాయ కళలకు ఆదరిస్తున్న కొన్ని గ్రామాల్లో గవర్ల అనకాపల్లి ఒకటి. పరదేశమ్మ పండగ సందర్భంగా మండలంలోని గవర్ల అనకాపల్లి గ్రామంలో ప్రదర్శిస్తున్న వీధివేషాలు, వాలకాలను ఆ గ్రామస్తులు విశేషంగా ఆదరిస్తున్నారు. ఈ నెల 14న జరగనున్న పరదేశమ్మ పండుగకు వారంరోజుల ముందు నుంచి ఈ వాలకాల ప్రదర్శించడం గ్రామంలో అనాదిగా ప్రత్యేక ఆనవాయితీగా వస్తోంది. టీవీలు, సెల్‌ఫోన్ మోజులో పడి రంగస్థలం, వీధి వేషాల ప్రదర్శనలకు ఆదరణ కరువౌతున్న పరిస్థితుల్లోనూ గవర్ల అనకాపల్లిలో ప్రదర్శిస్తున్న ఈ వాలకాలు పలువురికి చక్కటి వినోదాన్ని అందిస్తున్నాయి. తాగుబోతుల వేషధారణ, చిలక జ్యోతిష్యం, స్త్రీల వేషధారణలో పురుషుల చమత్కారాల సన్నివేశాలు, కడుపుబ్బ నవ్విస్తున్నాయి. గవర్ల అనకాపల్లిలో ఇప్పటివరకు కేవలం పురుషులు, చిన్నపిల్లలు మాత్రమే వాలకాలుగా పిలవబడే ఈ వీధివేషాలలో పాల్గొంటుండగా, ఇపుడు గృహిణులు కూడా వీటి పట్ల ఆకర్షితులై వేషధారణలు చేయడం, ప్రదర్శన లివ్వడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుండగా, ఈ పరిణామాలు ప్రాచీనకళారూపాలకు మళ్లీ ఆదరణ పెరుగుతోందా అన్న ఆశలను పునరుజ్జీవింపజేస్తోందనే చెప్పొచ్చు. చిన్న, పెద్ద ముసలి, ముతక తేడా లేకుండా సమయభావం లేకుండా కన్నార్పకుండా చూసేలా గ్రామ కళాకారులు పెంటకోట శివాజీ, ఆళ్ల రమణారావు, పోలమరసెట్టి మహేష్, పోలమరశెట్టి వీరు నాయుడు, కాండ్రేగుల పూర్ణమ్మ, కాండ్రేగుల వెంకటలక్ష్మి, తదితర కళాకారులు వాలకాలను ప్రదర్శిస్తూ, ప్రజల మన్ననలు, ప్రశంసలను అందుకుంటున్నారు.


వీధి వేషాలను తిలకిస్తున్న గవర్ల అనకాపల్లి వాసులు

విత్తన గుళికల తయారీపై అవగాహన


విత్తన గుళికలు తయారీపై వివరిస్తున్న రత్నం

ప్రజాశక్తి- కశింకోట: మండలంలోని భీమవరం గ్రామంలో సేంద్రియ వ్యవసాయం, విత్తన గుళికల తయారీపై ఆదివారం గ్రామ మహిళా సంఘం ప్రతినిధి ఒబి రత్నం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విత్తన గుళికల వల్ల కలిగే ప్రయోజనాలను రైతులు, మహిళలకు అవగాహన కల్పించారు. రైతులందరూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రుతుపవనాల రాకకు ముందే ఈ విత్తన గుళికలను తయారు చేసుకోవాలని సూచించారు. రైతులంతా రసాయన ఎరువులు, క్రిమిసంహారాలకు స్వస్తి పలికి, ప్రకతి వ్యవసాయం చేయడం ద్వారా భూమి ఆరోగ్యం, మన ఆరోగ్యంతోపాటు పర్యావరణ పరిరక్షణ సాకారమౌతుందని వివరించారు. తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు, అధికాదాయం పొండవచ్చని సూచించారు. మండల ఇన్‌ఛార్జి డి.రమణ, రైతులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన


రక్తదానం చేస్తున్న సిఐ రంగనాథం, దాతలు

ప్రజాశక్తి- సబ్బవరం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శ్రీ బంగారమ్మ తల్లి భక్త బృందం, జనరేషన్ యువ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ రక్తదాన శిబిరాన్ని స్థానిక సిఐ పి.రంగనాథం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని దానాలలో కన్నా రక్తదానం ముఖ్యమైనదని, ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎందరికో ఊపిరిపోస్తుందన్నారు. రక్తదానం చేసి, ఆపదలో ఉన్నవారిని రక్షించాలని కోరారు. శిబిరంలో 140 మంది దాతలు పాల్గొని, సుమారు100 యూనిట్ల రక్తాన్ని దానం చేశారన్నారు. రోటరీ బ్లడ్ బ్లాంక్, లైఫ్‌షేర్ బ్లడ్ బ్యాంక్ చెరో 50 యూనిట్లు రక్తాన్ని సేకరించాయని తెలిపారు కార్యక్రమంలో సింగంపల్లి వెంకటరావు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన పోలీసులు

నిరుపేద మహిళ కంటి వైద్యానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : నిరుపేద మహిళకు వైద్యం ఖర్చులకు ఆర్థికసాయం చేయడం ద్వారా స్థానిక ఎస్ఐ టి.నరేంద్రప్రసాద్ మానవత్వాన్ని చాటుకున్నారు. రాజవొమ్మంగి గ్రామానికి చెందిన గూటాల నూకాలమ్మ దాదాపు 12ఏళ్లుగారాజవొమ్మంగి పోలీస్‌స్టేషన్‌లో స్వీపర్‌గా పనిచేసోత్తంది. ఆమె భర్త ఐదేళ్ల క్రితం మృతి చెందగా, ఉన్న ఒక్కగానొక్క కూతురుతో జీవనం సాగిస్తోంది.ఆమెకు ఎప్పటినుంచో ఒక కన్ను పూర్తిగా కనిపించకపోగా, పదిరోజుల క్రితంఆమె మేనల్లుడి కుమారుడు,మూడేళ్లబాబు ఆడుకుంటూ, విసిరిన టమోటా చూపున్న రెండో కంటికి తగలడంతో గాయమై, ఆ కన్ను కూడా కనిపించని పరిస్థితి ఏర్పడింది. విశాఖలోని కంటి వైద్యుల వద్ద పరీక్షించగా, ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. దీంతో నూకాలమ్మ కంటి ఆపరేషన్‌కు ఎస్ఐ నరేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులంతా సమకూర్చిన రూ.16వేలు నగదును ఆమె వైద్యఖర్చులకు అందజేశారు. వైద్యానికి ఆర్థికసాయం అందించిన పోలీసులను పలువురు అభినందించారు.

పోలింగ్ కేంద్రాలను అధికారుల పరిశీలన


కశింకోటలో పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న ఎంపిడిఒ


పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న తహసిల్దార్ అంబేద్కర్

కశింకోట: స్థానిక రెండో నెంబరు పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలు (189, 190)లను స్థానిక ఎంపిడిఒ కొంకి అప్పారావు ఆదివారంపరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు, సౌకర్యాలపై మరోమారు పరిశీలన జరిపి నిర్ధారించుకున్నారు. ఓటు హక్కు వినియోగించడానికి వచ్చిన పట్టభద్రులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తగు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. పంచాయతీ కార్యదర్శి రమేష్ ఉన్నారు.

బుచ్చయ్యపేట : మండల కేంద్రంలోని ఎంపిపి స్కూల్‌లో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని స్థానిక తహశీల్దార్ ఎస్‌వి.అంబేద్కర్ ఆదివారం పరిశీలించారు. ఈకేంద్రంలో 933 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని తహశీల్దార్ తెలిపారు. ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

కశింకోట : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కశింకోటలోని పోలింగ్ కేంద్రాన్ని ఎస్ఐ ఆదినారాయణ ఆదివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రం వద్ద భద్రతాఏర్పాట్లను చూశారు. పోలింగ్ సమయంలో కేంద్రం పరిసరాల్లో అనుమతులు లేకుండా ఎవరూ రాకూడదని సూచించారు. కేంద్రానికి చేరుకున్న పోలింగ్ అధికారులు, సిబ్బందికి తగు సూచనలు చేశారు.


కశింకోటలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్ఐ

పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

ప్రజాశక్తి -అనకాపల్లి : స్థానిక గవరపాలెం కామాక్షిదేవి ఆలయంలో ఆదివారం పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం సర్వసభ్య సమావేశం అధ్యక్షులు కోసూరు మన్మధరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ముందుగా చేపల మార్కెట్ వద్ద ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహానికి పూలమాల వేసే నివాళులు అర్పించారు. వైసిపి పార్లమెంటరీ పరిశీలకులు దాడి రత్నాకర్ హాజరై నూతన కార్యవర్గాన్ని అభినందించారు. నూతన అధ్యక్షునిగా కోటిపల్లి జేజిబాబు, ప్రధాన కార్యదర్శిగా కొమ్మోజు గోవిందరాజు, కోశాధికారిగా పొన్నాడ సత్య నరసింహాచారి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంతో సంఘం రాష్ట్ర అధ్యక్షులు పావులూరి హనుమంతరావు ప్రమాణ స్వీకారం చేయించారు. వెదురుపర్తి సుందరయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దువ్వూరి నరసింహాచారి, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కోటిపల్లి శ్రీదేవి, గౌరవాధ్యక్షులు మత్తుర్తి గంగారాం, పూర్వ సంఘ ప్రధాన కార్యదర్శి దోసూరు చంద్రశేఖర్, పూర్వ కోశాధికారి కడియం రామకృష్ణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

జల విద్యుత్ కేంద్రాన్ని హైడల్ డైరెక్టర్ సందర్శన


ప్రాజెక్ట్ నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న హైడల్ డైరెక్టర్

ప్రజాశక్తి -సీలేరు: ఎపి జెన్‌కో హైడెల్ డైరెక్టర్ ఎంవి.సత్యనారాయణ ఆదివారం సీలేరు జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. ఇంజనీర్లు, కార్మికులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ క్రమంలోనే ఇంజనీర్లకు కార్మికులకు ఏమైనా సమస్యలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. జల విద్యుత్ కేంద్రంలో ఉన్న నాలుగు యూనిట్లు పనితీరు తదితర అంశాలపై ఇంజనీర్లతో సుదీర్ఘంగా చర్చించి తెలుసుకున్నారు. జలవిద్యుత్ యూనిట్లు పనితీరు స్వయంగా పరిశీలించారు. రెండో యూనిట్ ఓవరాల్ పనులకు చేసుకుంటామని డైరెక్టర్ సత్యనారాయణను ఇఇ లక్ష్మినారాయణ కోరారు. రాష్ట్రంలో పెరుగుతోన్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని మే నెలలో రెండో యూనిట్ ఓవరాల్ పనులకు తీసుకోవాలని ఆదేశించారు.

అలాగే ఇటీవల యూనిట్లకు అమర్చిన డిజిటల్ ఆటోమేటిక్ రెగ్యులేటర్ పనితీరు ఏ విధంగా ఉందని డైరెక్టర్ సత్యనారాయణ ఆరా తీశారు. అనంతరం జల విద్యుత్ కేంద్ర సమీపంలో ఉన్న పార్వతి నగర్ వద్ద 1350 మెగావాట్లు సామర్థ్యం గల పంపు స్టోరేజ్ టన్నెల్ ప్రాజెక్టు నిర్మాణ ప్రదేశాన్ని సందర్శించి పరిశీలించారు. ప్రాజెక్టుకు సంబంధించిన మ్యాపును పరిశీలించి విధి విధానాలను ఇంజనీర్లు అడిగి అరా తీశారు. సీలేరు జలాశయం సమీపంలో ఉన్న శాండ్‌కోరి గ్రామం నుంచి భూఅంతర్భాగంలో నిర్మిస్తున్న టన్నెల్‌కు సంబంధించిన పాయింట్లు వివరాలు రూట్ మ్యాప్ ఆధారంగా ఏ విధంగా ఉన్నాయనే దానిపై ఐడల్ డైరెక్టర్ సత్యనారాయణకు ఎఇ సురేష్ వివరించారు. కార్యక్రమంలో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బి. శ్రీధర్, ఇఇలు బాలకృష్ణ, బాబూరావు, ప్రభాకర్, ఎఇ సురేష్ పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై చర్యలేవీ?

ప్రజాశక్తి -రంపచోడవరం : వై.రామవరం వెలుగు కార్యాలయంలో నిధుల దుర్వినియోగంపై అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం దుర్మార్గమని గిరిజన సంఘం నేతలు విమర్శించారు. నిధుల దుర్వినియోగం, అవినీతికి పాల్పడిన సిసి నీలవేణిని విధుల నుంచి తొలగించడంతోపాటు రంపచోడవరం ఎడిపిని సస్పెండ్ చేయాలని గిరిజన సంఘం నేత కంభం శాంతిరాజు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

వై రామవరం వెలుగు కార్యాలయంలో పనిచేస్తున్న సిఇస బి.నీలవేణి, మండలంలోని దేవరమాడుగుల, దాలిపాడు, వై రామవరం, చవిటి దిబ్బలు గ్రామాల మహిళా గ్రూపులకు చెందిన సుమారు రూ.7 లక్షలను సొంత అవసరాలకు వాడుకుని, నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు.. నిధుల దుర్వినియోగంపై వై రామవరం వెలుగు ఎపిఎం మధుబాబు లిఖితపూర్వకంగా రంపచోడవరం ఎపిడికి ఫిర్యాదు చేశారన్నారు. అయితే సిసిపై ఎటువంటి శాఖాపరమైన చర్యలు తీసుకోకపోగా, దుర్వినియోగానికి పాల్పడిన నిధులను 72వాయిదాల్లో చెల్లించాలనడం దుర్మార్గమన్నారు.



హాజరైన తల్లిదండ్రులు

టెన్త్ విద్యార్థులపై దృష్టి

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కృష్ణదేవిపేట జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు భారతి ఆధ్వర్యంలో ఆదివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ, 10వ తరగతి పరీక్షలు సమీపిస్తుండటంతో తమ పిల్లల పట్ల తల్లిదండ్రులు ఏ విధంగా మెలగాలో వివరించారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకు సహకరించాలని సూచించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి విద్యార్థులపై శ్రద్ధ తీసుకుంటే మంచి ఫలితాలు సాధిస్తారని తెలిపారు. కష్ట పడి చదివే విధంగా చూడాలని సూచించారు. ప్రతీ పది మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడికి పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. దీంతో ఆయా విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్ఎం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రామరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

100 అడుగుల రోడ్డు విస్తరణతో తీవ్ర నష్టం

సమావేశంలో వ్యాపారస్తులు

వ్యాపారస్తులందరూ ఒకటిగా ఉండి విజయం సాధించేలా కార్యాచరణ ఏర్పాటు చేయాలని పిలుపు నిచ్చారు.

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్థానిక రోడ్డు విస్తరణతో షాపు యజమానులు, వ్యాపారస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం సాయంత్రం స్థానిక వాసవి కళ్యాణ మండపంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి వ్యాపారస్తులు, షాపు యజమానులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నర్సీపట్నంలో 100 అడుగుల రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు జరుగుతున్న విషయం పై ఆందోళన చెందుతున్నామన్నారు. రోడ్డు విస్తరణలో సుమారుగా రూ.100 కోట్ల వరకు ఆస్తి నష్టం జరుగుతుందన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 80 అడుగుల రోడ్డు విస్తరణ పనులు మాత్రమే చేపట్టాలని అభ్యర్థించారు. ఈ సమస్యను ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ద్వారా ప్రభుత్వానికి తెలియజేయాలని తీర్మానం చేశారు.



హాజరైన వ్యాపారులు, షాపుల యజమానులు

వసతి గృహాల్లో తనిఖీలు

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాలను ఆదివారం ఎంపీడీవో సీతారామరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటసాలను సందర్శించి భోజనం తయారీని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రతిరోజు మెనూ ప్రకారం రుచిగా, శుచిగా భోజనాన్ని పెట్టాలన్నారు. రికార్డులను తనిఖీ చేశారు. టాయిలెట్స్ పరిశీలించి, నిర్వహణ సక్రమంగా ఉండే విధంగా చూడాలని వార్డెన్‌కు సూచించారు.



పరిశీలిస్తున్న ఎంపిడిఒ



విత్తన గుళికలు తయారు చేస్తున్న సంఘం సభ్యులు

విత్తన గుళికలతో లాభాలు

- రైతులకు తయారీపై అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కొత్తయల్లవరం గ్రామంలో ఆదివారం గ్రామ సంఘ సభ్యులు విత్తన గుళికలు తయారు చేయడంతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. విత్తన గుళికలను తయారు చేసి ఉంచుకోవడంతో విత్తనాలు పాడవకుండా ఉంటాయన్నారు. మొలక శాతం పెరగటం వంటి అనేక ఉపయోగాలు ఉన్నాయని వివరించారు. నవ ధాన్యాల సాగుతో భూమిలో కలిగే మార్పు, విత్తన గుళికల తయారీలో ఉపయోగించే బీజామృతం, మట్టి పొడి, ఘనజీవామృతం, పొయ్యి బూడిద వంటి విధానం వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామంలోని గ్రామ సంఘ లీడర్లు వరలక్ష్మి, సంఘ సభ్యులు, గొలుగొండ ఎంపిటిసి సత్యనారాయణ, రామకృష్ణ, ఐసిఆర్‌పిఎస్ అర్జున, నూకరత్నం, ఎర్రయమ్మ పాల్గొన్నారు.

ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవం



అనకాపల్లిలో జెండా ఎగుర వేస్తున్న మంత్రి, ఎంపి

ప్రజాశక్తి -యంత్రాంగం

వైసిపి ఆవిర్భావ దినోత్సవాన్ని విశాఖ, అనకాపల్లి జిల్లాలో ఆ పార్టీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించాంతు.

భీమునిపట్నం: స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన వేడుకల్లో ముత్తంశెట్టి శ్రీనివాసరావు పార్టీను ఎగురవేశారు. వైఎస్.రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నో ఆటంకాలు, అవరోధాలను అధిగమిస్తూ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో జగన్మోహన్‌రెడ్డి కృషి ఎంతో గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, పార్టీ నాయకులు అల్లిపిల్లి నరసింగరావు, ఎస్ కరుణాకరరెడ్డి, కదిరి ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార :ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ఆధ్వర్యాన పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పార్టీ జెండాను ఎగరవేశారు. అనంతరం పార్టీ నాయకులు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ, వైఎస్.రాజశేఖరరెడ్డి ఆశయాలను కొనసాగించాలనే ఉద్దేశంతో జగన్మోహన్‌రెడ్డి వైసిపిని స్థాపించారని తెలిపారు. ముఖ్యమంత్రి అయ్యాక నవరత్న పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు అండగా ఉంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనీల్‌కుమార్‌రాజు, ఆళ్ల లీలావతిశ్రీనివాసరావు, చల్లా రజినిఈశ్వరరావు, వార్డు అధ్యక్షులు నీలి రవి, కెపి.రత్నాకర్, మాజీ కార్పొరేటర్లు పోతు సత్యనారాయణ, నాయకులు కిరణ్ రాజు, ఐహెచ్. ఫరూకి, కెవి.బాబా తదితరులు పాల్గొన్నారు.


అనకాపల్లి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో పనిచేయడం గర్వంగా ఉందని రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎంపి డాక్టర్ బి వి సత్యవతి అన్నారు. ఆదివారం స్థానిక రింగ్ రోడ్ లోని పార్టీ కార్యాలయంలో వైసిపి 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు, అనంతరం మంత్రి అమర్నాథ్, ఎంపీ సత్యవతి కేక్ కట్ చేశారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, ఎంపిపి గొర్లి సూరిబాబు, జిల్లా అధికార ప్రతినిధి మల్ల బుల్లిబాబు, వైసిపి యువజన విభాగం అధ్యక్షులు జాజుల రమేష్, ఎన్టీఆర్ ఆసుపత్రి డైరెక్టర్ అంటాకుల రత్నకుమారి, గైపూరి రాజు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని కలిగొట్ల గ్రామంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో కేక్‌ను ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు కట్ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బూరె బాబూరావు, జెడ్పీటీసీ కర్రీ సత్యం, యువజన విభాగం అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, సర్పంచ్‌లు గొర్రెపోటు సుధారాణి సారధి, నాగిరెడ్డి శరారి నాయుడు, రొంగలి వెంకటరావు, పిఎసిఎస్ అధ్యక్షులు దాసరి గోపి, బండారు ప్రసాదరావు, మండల సచివాలయ కన్వీనర్ కె.వి రమణ పాల్గొన్నారు.


మునగపాక రూరల్: మునగపాక. మెయిన్ రోడ్‌లోని గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ క్యాంపు కార్యాలయంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. కేకును కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైసిపి నేతలు మల్ల సంజీవరావు, దాసర అప్పారావు, సూరిశెట్టి కన్నారావు, భీశెట్టి గంగ అప్పలనాయుడు, బొడ్డేడ శ్రీనివాసరావు, ఎల్లపు భాస్కరరావు బొడ్డేడ సత్యనారాయణ పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్:స్థానిక వైయస్సార్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు నియోజకవర్గం నాలుగు మండలాల నుండి ముఖ్య నాయకులు తరలివచ్చారు. ముందుగా వైయస్సార్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ,ఎన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ సుదీర్ఘ పాదయాత్రతో సిఎం జగన్ పార్టీని గెలిపించారన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, వైసిపి నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, కౌన్సిలర్లు కోనేటి రామకృష్ణ, నాని అప్పలనాయుడు పాల్గొన్నారు

చీడికాడ:మండల కేంద్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మండల పార్టీ అధ్యక్షులు గొల్లవిల్లి రాజబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను అనకాపల్లి జిల్లా వ్యవసాయ సంఘం అధ్యక్షుడు ఎర్ర అప్పారావు, ఎంపీపీ కురచా జయమ్మ నారాయణమూర్తి, జెడ్పిటిసి లాలం శారద వరలక్ష్మి జానకిరామ్ ఆవిష్కరణ చేసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు పరవాడ మహేష్, నాయకులు డి కొండబాబు, షేక్ సూర్యనారాయణ, సుంకర శ్రీను, పడాల శ్రీను పాల్గొన్నారు



నర్సీపట్నంలో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గణేష్



భీమిలిలో జెండా ఎగురవేస్తున్న మాజీ మంత్రి ముత్తంశెట్టి

నక్కపల్లి:నక్కపల్లిలో వైసీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, పార్టీ మండల శాఖ అధ్యక్షులు పాపారావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఈశ్వరరావు, నాయకులు మణి రాజు, కొప్పిశెట్టి హరిబాబు, రాజు, సత్యనారాయణ, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

యస్.రాయవరం:మండలంలోని కోరుప్రోలు వైసిపి క్యాంపు కార్యాలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. శాసనసభ్యులు గొల్ల బాబురావు కేక్ కటింగ్ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో ఆటుపోట్లను, సవాళ్ళను ఎదుర్కొని ప్రజల్లో నిలిచిన పార్టీ వైసీపీ అని అన్నారు. దేశంలోనే ఒక బలమైన రాజకీయ శక్తిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కమిటీ చైర్మన్ చిక్కాల రామారావు, పాయకరావుపేట మండల పార్టీ అధ్యక్షులు ధనిశెట్టి బాబురావు, నక్కపల్లి మండల వైసీపీ నాయకులు శీరం నరసింహమూర్తి, ట్రస్ట్ బోర్డ్ ఆహ్వానిత సభ్యురాలు జనపరెడ్డి శేషారత్నం, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు లొడగల చంద్రరావు, పీఏసీఎస్ అధ్యక్షులు యలమంచిలి తాతబాబు, సూరకాసుల గోవిందరావు పాల్గొన్నారు.



ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-మాడుగుల: మాడుగుల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 1995-96 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రతిష్టించారు. విశ్రాంత ఉపాధ్యాయులు రామ్ మోహన్ రావు చేతుల మీదుగా విగ్రహ ఆవిష్కరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జవ్వాడి వరహాలు, దంగేటి మోహన్, ఏర్రంశెట్టి గణేష్, కర్రి ప్రకాష్, నూకరాజు, వాసు, జగన్నాథరావు, రాజా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజు

ఇష్టపడి చదివితే సత్ఫలితాలు

భారత మానసిక వైద్య సంఘం జాతీయ అధ్యక్షులు రాజు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన సెమినార్

ప్రజాశక్తి-పాడేరు: పరీక్షల్లో సత్ఫలితాలను సాధించేందుకు విద్యార్థులు ఎటువంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా మనసుపెట్టి ఇష్టపడి చదవాలని భారత మానసిక వైద్య సంఘం జాతీయ అధ్యక్షులు, ప్రభుత్వ మానసిక ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ ఎన్ఎన్ రాజు విద్యార్థినులకు ఉద్బోధించారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు బాలికల గురుకుల కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పరీక్షలలో మంచి ఫలితాలు - మార్గాలు అనే అంశంపై గిరిజన విద్యార్థులకు శనివారం సాయంత్రం సెమినార్ నిర్వహించారు. ముఖ్య వక్త ఎన్ఎన్ రాజు మాట్లాడుతూ, పరీక్షలంటే విద్యార్థినులలో సహజంగా ఉండే భయాన్ని, ఆచరించాల్సిన నియమాలకు సూచనలను వివరించారు. భయం, ఒత్తిడికి గురి కాకుండా ఆరోగ్యకర అలవాట్లపై వివరించారు. ఖాళీ సమయాల్లో ఆటపాటలు, రాయడం, చదవడం సంగీతం వినడం వంటి అలవాట్లు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయని ఆయన సూచించారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి.చిన్నారావు మాట్లాడుతూ, విద్యార్థులు పరీక్షలకు ముందు నుంచే చదివితే మంచి ఫలితాలు సాధించ వచ్చునని తెలిపారు. చదువు పట్ల ఏకాగ్రత, ప్రశాంతత చాలా అవసరమన్నారు. మంచి లక్ష్యాలు నిర్దేశించుకుని తమ భవిష్యత్తుకు మంచి బాటలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామలక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు బి.నరేష్, పి.వరహాలు, మండల నాయకులు మాణిక్యం, మత్స్యరాజు, విద్యార్థులు పాల్గొన్నారు..

యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-పాడేరు టౌన్: స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో పాడేరు మండలం యుటిఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేష్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికల పరిశీలకులుగా అసోసియేట్ అధ్యక్షులు సిహెచ్.నాగేశ్వరరావు వ్యవహరించారు. యుటిఎఫ్ మండల గౌరవ అధ్యక్షులుగా టి.కామేశ్వరరావు, అధ్యక్షులుగా వి.మహేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా జి.ఈశ్వరరావు, డి.ఈశ్వరి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.కర్రిబాబు, కోశాధికారిగా సిహెచ్.కొండబాబు, కార్యదర్శులుగా ఎం.లక్ష్మణ, కె.భీమరాజు, ఆడిట్ కమిటీ సభ్యులుగా రొబ్బ కావ్య, జిల్లా కౌన్సిలర్‌గా ఎస్.కర్రిబాబు ఎన్నికయ్యారు.

ఉపమాకలో మసాలా ఘుమ..ఘుమలు

-తీర్థంలో వ్యాపార దుకాణాల వద్ద జనం క్యూ -అధికంగా కొనుగోలు



మసాలా దినుసులు అమ్మకాలు చేపడుతున్న వ్యాపారులు

ప్రజాశక్తి-నక్కపల్లి: ఉపమాక తీర్థంలో మసాలా ఘుమ ఘుమ లాడుతోంది. ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన వెంకన్న వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా తీర్థంలో మసాలా దినుసులు వ్యాపారం ప్రత్యేకం. స్వామి వారి ఉత్సవాలు ఈనెల 2న ప్రారంభమై 10వ తేదీ రాత్రితో ముగిసాయి. ప్రతీ ఏటా స్వామి ఉత్సవాల సందర్భంగా కొత్త అమావాస్య ముందు రోజు వరకు (18 రోజుల పాటు) ఉత్సవాల తీర్థ జరుగుతుంది. అనంతరం ఈనెల 20వ తేదీ వరకు ఈ తీర్థం కొనసాగుతుంది. శని, ఆదివారాలు సెలవు రోజు కావడంతో పెద్ద సంఖ్యలో జనం తరలి వచ్చారు. తీర్థంలో మసాలా దినుసులు, పిల్లల ఆట వస్తువులు, గృహోపకర సామగ్రి, గాజులు, ఫ్యాన్సీ పావులతో పాటు తినుబండారాలకు సంబందించి తోపుడు బండ్లపై ఖర్జూరం, శెనగపప్పు, ద్రాక్ష వంటివి విక్రయిస్తారు. తీర్థంలో మసాలా దినుసులు వ్యాపారం అధికంగా సాగు తుంది. పసుపు, కుంకుం జీల కర్ర, ధ.॔ ని య॔ ా ల ం, యాలికలు, దాల్చిన చెక్క, లవంగాలు, గసగసాలు, అవాలు, ఫలావు సామగ్రి, వెల్లుల్లి పాయులు, ఎండు మిర్చి తదితర సుగంధ ద్రవ్యాలను విక్రయిస్తుంటారు. విశాఖ ఏజెన్సీ ప్రాంతంతో పాటు, ఉత్తరాంధ్ర, తూర్పుగోదావరి జిల్లాల్లో పలు గ్రామాల నుంచి జనం తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని ఏడాది పొడువునా సరిపడే మసాల దినుసులు కొనుగోలు చేసుకుంటారు. నర్సీపట్నం, అనకాపల్లి, యలమంచిలి, తదితర మండలాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు మసాలా దినుసులు కొనుగోలు చేసుకుంటున్నారు. వీటిని పెద్ద పెద్ద మూటలతో తీసుకు వెళ్తున్నారు. చాలా మంది భక్తులు మసాలా దినుసులు తప్పనిసరిగా కొనుక్కొని ఇళ్లకు తీసుకువెళ్ళడం అనవాయితీగా వస్తుంది. ఇవన్నీ ఒకే చోట లభించడంతో జనం దుకాణాల వద్ద ఎగబడుతున్నారు. దీంతో ,మసాలా దినుసుల దుకాణాలు జనం రద్దీతో కిటకిలాడుతున్నాయి. జాతర సందర్భంగా లక్షలాధి రూపాయుల మసాలా దినుసుల వ్యాపారం సాగుతుంది. తీర్థంలో పలు ప్రాంతాల నుంచి వ్యాపారులు కమ్మలతో తాత్కాలిక షాపులు ఏర్పాటు చేసుకుని వ్యాపారం సాగిస్తున్నారు.



బస్తాల్లో తీసుకెళుతున్న మహిళలు

ఎమ్మెల్సీ పోలింగ్‌కు పటిష్ట బందోబస్తు

-డిఎస్‌పి ప్రవీణ్ కుమార్ - పలు కేంద్రాలు పరిశీలన



ఎస్.రాయవరంలో సూచనలు ఇస్తున్న డిఎస్‌పి

ప్రజాశక్తి-నక్కపల్లి: ఈనెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డిఎస్‌పి ప్రవీణ్ కుమార్ తెలిపారు. నక్కపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం సాయంత్రం స్థానిక ఎస్ఐ శిరీష తో కలిసి పరిశీలించారు. పోలింగ్ జరిగేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, భద్రత చర్యలపై చర్చించారు. బందోబస్తు ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు.

యస్.రాయవరం: మండలంలోని ధర్మవరం పోలింగ్ బూత్‌ను నర్సీపట్నం డిఎస్పీ కె.ప్రవీణ్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయన వెంట తహశీల్దార్ వై.శ్యామ్ కుమార్, సిఐ నారాయణరావు, ఎస్ఐ ప్రసాదరావు పాల్గొన్నారు.

కోటవురట్ల: పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం సిఐ నారాయణరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ. నక్కపల్లి సర్కిల్ పరిధిలో నాలుగు పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కోటవురట్ల1, రాయవరం1, నక్కపల్లి2, కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, స్థానిక ఎస్సై నారాయణరావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

నక్కపల్లి: నక్కపల్లిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఎంపీడీవో సీతారామరాజు, ఎస్ఐ శిరీష పరిశీలించారు. బందోబస్తు ఏర్పాటుపై ఎస్ఐ శిరీషను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్, తాగునీరు, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. పోలింగ్ స్టేషన్‌లో అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.రెండు పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 1118 మంది ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

కోటవురట్ల: ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి సిబ్బంది పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. 1092 ఓట్లుకు గాను నలుగురు సిబ్బందిని నియమించారు. అదే విధంగా నాలుగు బాక్సులు సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరా ఏర్పాటు చేయడంతో పాటు సిబ్బందికి, ఓటర్లకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు స్థానిక తహసిల్దారు జానకమ్మ తెలిపారు. పట్టబద్రులు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

గొలుగొండ: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహశీల్దార్ ఆనందరావు తెలిపారు. మండలంలో 1044 పట్టభద్రుల ఓట్లు ఉన్నాయి. వీరంతా ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మండల కేంద్రంలో ఎంపిపి పాఠశాలలో పోలింగ్ బూత్ కేటాయించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ, ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కేంద్రానికి వంద మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.ఎస్సై నారాయణరావు ఆధ్వర్యంలో పోలింగ్ బందోబస్తు ఏర్పాటు చేశారు.


నర్సీపట్నం టౌన్: పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో నర్సీపట్నం జిల్లా పరిషత్ మెయిన్ స్కూల్ వద్ద నాలుగు పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు డిఎస్‌పి ప్రవీణ్ కుమార్, ఎస్ఐ గోవిందరావులు తెలిపారు.ఎటువంటి అవాంతరాలు ఎదురవకుండా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

పోలీసుల కవాతు

గొలుగొండ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలో ఎస్సై నారాయణరావు ఆధ్వర్యంలో పోలీస్ కవాతు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద శాంతి భద్రతలకు భంగం కలగకుండా పోలీస్ కవాతు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ఎన్నికల సందర్భంగా 30 మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

పోలింగ్ కేంద్రాన్ని ఆర్‌డిఒ పరిశీలన

నక్కపల్లి: నక్కపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం సాయంత్రం నర్సీపట్నం ఆర్డిఓ జయరాం పరిశీలించారు. పోలింగ్ ఏర్పాట్లపై స్థానిక అధికారులతో సమీక్షించారు.పోలింగ్ సామగ్రితో ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. ఈ మేరకు ఎన్నికల విధులకు హాజరైన సిబ్బందితో ఆర్‌డిఓ మాట్లాడారు. పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామరాజు, ఇన్చార్జి తహసిల్దార్ నీరజ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆర్‌డిఒ జయరాం